

తుది దశకు 'అమ్మ ఆదర్శం'

జిల్లాలోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులు చాలా చోట్ల పూర్తికాగా మరికొన్ని చోట్ల చివరిదశకు చేరాయి. 8లో▸



కాంగ్రెస్ ఎంతకైనా..

రాజకీయ అవసరాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎంతకైనా దిగజారుతుందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. 8లో▸



రైతు సమస్యలు..

రైతు సమస్యలు పరిష్కరించాలని ప్రజా సంఘాల నాయకులు కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. 8లో▸

న్యూస్‌రీల్

లైబ్రరీల్లో వసతుల కల్పనకు కృషి

గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రియాజ్



మాట్లాడుతున్న డాక్టర్ రియాజ్

అనంతగిరి: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని లైబ్రరీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రియాజ్ అన్నారు. వికారాబాద్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఆవరణతోపాటు లైబ్రరీలోని అన్ని విభాగాలను పరిశీలించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతతో ముచ్చటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు వస్తాయని తెలిపారు. పోటీ పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలో వివరించారు. చక్కని ప్రణాళికతో స్కూల్, ఇంటర్, జనరల్ పుస్తకాలను చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం కార్యదర్శి సురేష్‌బాబు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, యువత పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



మంత్రి సీతక్కతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మండల నాయకులు

యాలాల: పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను శుక్రవారం నగరంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మండల నాయకులు కలిశారు. సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ మొగులప్ప, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు అమృతప్ప తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ ఏడాది ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించారని అమృతప్ప తెలిపారు.

మరింత ఉత్సాహంగా పనిచేయండి



కేటీఆర్‌ను కలిసిన శుభప్రద్ పటేల్

అనంతగిరి: బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ శుక్రవారం నగరంలో మాజీ మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ ఉద్యమంలో వికారాబాద్ జిల్లా తరఫున క్రియాశీలక పాత్ర పోషించిన శుభప్రద్‌కు రానున్న రోజుల్లో బీఆర్ఎస్ తరఫున సముచిత గౌరవం లభిస్తుందని కేటీఆర్ అన్నారు. మరింత ఉత్సాహంగా పార్టీ బలోపేతానికి కృషిచేయాలని సూచించారు.

విద్యార్థుల్లో విశ్వాసం పెంచాలి

జిల్లా విద్యాధికారి రేణుకాదేవి



మాట్లాడుతున్న డీఈఓ రేణుకాదేవి

పరిగి: మాతృ భాషతోపాటు ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడేలా విద్యార్థుల్లో విశ్వాసం పెంపొందించాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి సూచించారు. పరిగి పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో యంగ్ ఓరేటర్స్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా సాగుతున్న వర్క్‌షాపును శుక్రవారం సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పాఠశాలల్లో నైపుణ్యాలను పెంచడానికి ప్రత్యేక చొరవ చూపాలన్నారు. వారంలో రెండు రోజులు ఆంగ్లంలో మాట్లాడే నైపుణ్యంపై ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ఎలాంటి భయం లేకుండా ఇంగ్లిష్ మాట్లాడేలా శిక్షణ ఇవ్వాలన్నారు. ఓరేటర్స్ క్లబ్ నిర్వహిస్తున్న వర్క్‌షాపు ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి హరిశ్చందర్, ఎంఓ రామ్‌మస్తాన్, మండల నోడల్ ఆఫీసర్ గోపాల్, మండల ట్రైనీ రిసోర్స్ పర్సన్ మోయిజ్ ఖాన్, రాజేష్, సంధ్యారాణి, వీణ పాల్గొన్నారు.



మరుగు.. కరువు

సాక్షి విజిట్

కేజీబీవీలు, గురుకులాల్లో విద్యార్థులకు సరిపడా లేని మరుగుదొడ్లు

జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీల్లో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. వందలాది మందికి పదిలోపే మరుగుదొడ్లు ఉన్నాయి. కాలకృత్యాలు తీర్చుకోవడానికి నిత్యం ఇబ్బంది పడాల్సి వస్తోంది. చాలా చోట్ల బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన చేస్తున్నారు. సమస్య తీవ్రంగా ఉన్నా ఇటు అధికారులు, అటు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

- కాలకృత్యాలు, స్నానాలకు సమయం సరిపోవడం లేదని ఆవేదన
- అదనంగా నిర్మించాలంటున్న విద్యార్థులు

దుద్యాల్: మండలంలోని చెట్టుపల్లి తండా కేజీబీవీ(గిరిజన)లో 291 విద్యార్థులు ఉండగా కేవలం 9 మరుగుదొడ్లు, 9 మూత్రశాలలు మాత్రమే ఉన్నాయి. సాధారణంగా 10 మంది విద్యార్థులకు ఒక మరుగుదొడ్డి చొప్పున ఉండాలి. ఈ లెక్కన 30 మరుగుదొడ్లు, 30 మూత్రశాలలు ఉండాలి. కానీ వంద మందికి సరిపడా వసతి మాత్రమే ఉంది. దీంతో విద్యార్థినులు నిత్యం అవస్థలు పడుతున్నారు. పాఠశాల సమయానికి కాలకృత్యాలు, స్నానాలు పూర్తి చేసుకోలేక పోతున్నారు. ఈ విషయమై కేజీబీవీ ఎస్‌ఓ రాధికను సంప్రదించగా ప్రస్తుతం ఉన్న మరుగుదొడ్లు విద్యార్థినులకు సరిపోవడం లేదని, అదనంగా మరో 20 నిర్మించాల్సి ఉందని తెలిపారు.

మైనార్టీ గురుకులంలో..

మండలంలోని చిలుముల మైల్వార్‌లోని మైనార్టీ గురుకులాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. అరకొర వసతులతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. 240 మందికి గాను కేవలం 14 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. దీంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నారు.



చెట్టుపల్లి తండా కేజీబీవీలోని మరుగుదొడ్లు

ప్రతిపాదనలు పంపాం

కొడంగల్ రూరల్: కొడంగల్ శివారులో మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకులం, ఉడిమేశ్వరంలో బీసీ గురుకులం, పాతకొడంగల్‌లో గిరిజన గురుకులం ఉంది. వీటిలో 523మంది విద్యార్థులు ఉండగా 24 మరుగుదొడ్లు ఉన్నాయి. అదనపు వాటి కోసం ప్రతిపాదనలు పంపినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు.



కొడంగల్ రూరల్: కొనసాగుతున్న సెప్టిక్ ట్యాంక్ నిర్మాణ పనులు

నిర్వహణ అస్తవ్యస్తం

తాండూరు రూరల్: మండలంలోని జినుగుర్తి మైనార్టీ బాలురు గురుకుల పాఠశాల, కళాశాలలో 496 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిక సరిపడా 77 మూత్రశాలలు, 85 మరుగుదొడ్లు ఉన్నాయి. అయితే ఇద్దరు స్కావెంజర్లు ఉన్నారు. దీంతో మరుగుదొడ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మూత్రశాలలు కంపు కొడుతున్నాయి. వాటిలోకి వెళ్లలేకపోతున్నామని విద్యార్థులు అంటున్నారు.

దుర్వాసన వస్తోంది



పాఠశాలలోని మూత్రశాలలు కంపు కొడుతున్నాయి. వాటి నిర్వహణకు ఇద్దరు స్కావెంజర్లు మాత్రమే ఉన్నారు. పనిభారం వల్ల మూత్రశాలలను సరిగ్గా శుభ్రం చేయడం లేదు. కొంత మంది విద్యార్థులు కూడా మూత్ర విసర్జన చేసిన తర్వాత నీళ్లు పోయడం లేదు.

– మల్లేశ్, 8వ తరగతి, మైనార్టీ గురుకులం, జినుగుర్తి



తాండూరు రూరల్: జినుగుర్తి హాస్టల్‌లో మరుగుదొడ్డి దుస్థితి



నవాబుపేట కేజీబీవీలో అరకొరగా ఉన్న మరుగుదొడ్లు

నిత్యం అవస్థలే

నవాబుపేట: మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి నిత్యం ఇబ్బంది పడాల్సి వస్తోంది. పాఠశాలలో 255 మంది విద్యార్థులు ఉండగా కేవలం 9 మరుగుదొడ్లు, 9 బాత్‌రూంలు మాత్రమే ఉన్నాయి. దీంతో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. అంతేకాకుండా విద్యార్థుల సంఖ్యకు సరిపడా తరగతి గదులు లేవు. అదనపు గదులు మంజూరైనట్లు అధికారులు చెబుతున్నా పనులు మాత్రం ప్రారంభం కావడం లేదు. దీంతో విద్యార్థుల సమస్యలు తీరడం లేదు.

540 మందికి 44 టాయిలెట్స్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్(జూనియర్ కళాశాల)లో మరుగుదొడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. ఈ పాఠశాలలో 540 మంది విద్యార్థులకు గాను 44 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. ఉన్నావాటికి సైతం తలుపులు లేకపోవడం.. ఇనుప తలుపులు తుప్పు పట్టి పాడయ్యాయి. కాలకృత్యాలకు తీర్చుకునేందుకు కనీసం మగ్గు, బకెట్ సదుపాయం కూడా లేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి అదనపు మరుగుదొడ్లు నిర్మించి.. పాడైన వాటికి మరమ్మతులు చేయించి తమ ఇబ్బందులు దూరం చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

560మందికి 10 మరుగుదొడ్లే

కుల్కచర్ల: మండలంలోని బండవెల్కిచర్ల గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలలో 560 మంది విద్యార్థులు, 40 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. 600 మందికి కేవలం 10మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. వీటిలో రెండింటిని సిబ్బంది వినియోగిస్తున్నారు. మిగతా ఎనిమిదిని 560 మంది విద్యార్థులు వినియోగించుకోవాల్సి వస్తోంది. ఉన్నవి కూడా అపరిశుభ్రంగా మారడంతో విద్యార్థులు బహిరంగ మలవిసర్జనకు మొగ్గుచూపుతున్నారు. దీంతో పాఠశాల పరిసరాలు కంపు కొడుతున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. వెంటనే అదనపు మరుగుదొడ్లు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.



కుల్కచర్ల: ట్యాపులు లేని నల్లాలు

అందరూ ఒకేసారి రావడంతో..



ఉదయం అందరూ ఒకేసారి కాలకృత్యాలు తీర్చుకునేందుకు వస్తున్నారు. దీంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఉన్నవి సరిపోకపోవడంతో ఎక్కువ మంది విద్యార్థులు ఆరుబయటకు వెళుతున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలి.

– శ్రీకాంత్, 7వ తరగతి, గిరిజన గురుకులం, బండవెల్కిచర్ల

తీవ్ర ఇబ్బందులు



ఉదయం నిద్రలేవంగానే అందరూ కాలకృత్యాలు తీర్చుకునేందుకు మరుగుదొడ్లకు క్యూ కడుతున్నారు. దీంతో గంటల కొద్ది వేచి చూడాల్సి వస్తోంది. ఒక్కోసారి అల్పాహారం తినకుండానే పాఠశాలకు వెళ్లాల్సి వస్తోంది. చాలా మంది బహిరంగ మలవిసర్జనకు వెళుతున్నారు.

– అఖిలాష్, 7వ తరగతి, గిరిజన గురుకులం, బండవెల్కిచర్ల



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

హామీలను.. ఒక్కొక్కటిగా అమలు చేస్తాం

- ప్రతి రైతుకు రుణమాఫీ
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తామని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం మోమిన్‌పేటలో మహాలక్ష్మి పథకంలో భాగంగా 4,601మంది లబ్ధిదారులకు రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్ ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల లోపు వారికి ఉచిత విద్యుత్, రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్ పథకం అమలు చేసినట్లు తెలిపారు. త్వరలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ.లక్ష నగదుతోపాటు తులం బంగారం ఇస్తామని చెప్పారు. అలాగే ప్రతి మహిళకు నెలనెలా రూ.2,500 నగదు అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని ఆరోపించారు. ప్రతి రైతుకూ రుణమాఫీ అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పేదల ప్రభుత్వమన్నారు. నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ రోడ్ల అభివృద్ధికి రూ.600 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. సాగు నీటి ప్రాజెక్టులు, అనంతగిరులను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి పూర్ణచందర్‌రావు, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఎంపీఓ యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు నరోత్తంరెడ్డి, మహేందర్‌రెడ్డి, సురేందర్, సుభాష్ గౌడ్, విఠల్, మహంత్ స్వామి, సిరాజొద్దీన్, మాణయ్య, వెంకటయ్య, సుభాష్, మల్లేశం, చంద్రయ్య, మహేందర్, నర్సింలు, ఎజాస్, ఎరాజ్ పాల్గొన్నారు.

జీపీల్లో ప్రజాపాలన సేవ కేంద్రాలు



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో ప్రజాపాలన సేవ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. వాటి ద్వారా ప్రజలు ఇచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి అన్ని మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని 566 గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలన సేవ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పథకాల కోసం అర్జీలు ఇచ్చేందుకు వచ్చే ప్రజలను వెనక్కు పంపరాదని సూచించారు. దరఖాస్తుల్లో సమాచారం లేకుంటే అడిగి నమోదు చేయాలన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలకు రంగులు వేయడం, తాగునీటి వసతి, మరుగుదొడ్ల నిర్మాణం వంటి పనులు పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డులు ఇవ్వాలన్నారు. గ్రామాల్లో నిత్యం పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్‌డీఏ శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ చల్మారెడ్డి, మాతా శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాల వారీగా వర్గీకరణ చేపట్టాలి

మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి



పరిగి: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పిడమర్తి రవి తదితరులు

పరిగి: జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి కోరారు. మాదిగల మేల్కొలుపు యాత్రలో భాగంగా శుక్రవారం పరిగికి చేరుకున్న ఆయన పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మాదిగలకు 12శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఉమ్మడి జిల్లాల వారీగా జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం కమిటీ వేయడం హర్షణీయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాదిగలకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రి వర్గంలో ముదిరాజ్‌లకు, మాలలకు, లంబాడీలకు స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 30న భువనగిరిలో మాదిగల మేల్కొలుపు యాత్ర ముగింపు సభ ఉంటుందన్నారు. మాదిగలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ మెంబర్ రమేష్ బాబు, శ్రీను, మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు వీరేందర్, నాయకులు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డితోనే మాదిగలకు న్యాయం

కొడంగల్ రూరల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోనే మాదిగలకు సంపూర్ణ న్యాయం జరుగుతుందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. మాదిగల మేలు కొలుపు యాత్ర శుక్రవారం కొడంగల్ పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాల వారీగా వర్గీకరణ చేపట్టాలని కోరారు. అంబేడ్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రమేష్‌బాబు ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ జిల్లా మానిటరింగ్ కమిటీ మెంబర్ ఎన్ రమేష్ బాబు, కె.శ్రీను, పి.శ్రీను, మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు బొల్లికొండ వీరేందర్, ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మైస ఉపేందర్, బీఎస్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్, దేవరకొండ నరేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ కృషి



సీసీ రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు

కుల్కచర్ల: గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. కుల్కచర్లలో సీసీరోడ్డు ఏర్పాటుకు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చొరవ చూపడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పార్టీ బీ బ్లాక్ అధ్యక్షుడు భరత్ కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు గోపాల్‌నాయక్, వెంకటయ్య, రాంచంద్రయ్య, ఆనందం, వెంకటేశ్, ఎం.వెంకటేష్, కృష్ణయ్య, కృష్ణయ్య, వెంకటయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

14 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

ఇద్దరిపై కేసు నమోదు



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం ఆటో

పెద్దేముల్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ (పీడీఎస్) బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. పెద్దేముల్ ఎస్‌ఐ గిరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన క్లాం వెంకటేశం, బోయిని సుభాష్ 14 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని.. మినీ గూడ్స్ వాహనంలో శుక్రవారం ఉదయం తాండూరు నుంచి జహీరాబాద్ తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు వికారాబాద్ జిల్లా టాస్క్‌ఫోర్స్, పెద్దేముల్ పోలీసులతో పాటు సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ గణపతి వాహనాన్ని అడ్డుకుని పెద్దేముల్ పీఎస్‌కు తరలించారు. పంచనామా అనంతరం ఇద్దరిపైనా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రభుత్వం పేదలకు అందజేస్తున్న రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బస్సులో బంగారు ఆభరణాల చోరీ



ప్రయాణికులను సోదా చేస్తున్న పోలీసులు

ధారూరు: బస్సులో ప్రయాణిస్తున్న మహిళ సంచిలోంచి బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈ సంఘటన వికారాబాద్ ప్రాంతంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం సదరు మహిళ వికారాబాద్‌లో సాయంత్రం 6 గంటల ప్రాంతంలో తాండూరుకు వెళ్లేందుకు బస్సు ఎక్కింది. కండక్టర్‌కు ఆధార్‌కార్డు చూపేందుకు తన బ్యాగ్‌ను తీయగా అందులోని 2 తులాల బంగారు చైన్, ఉంగరాలు, వెండి వస్తువులు పోయాయని గుర్తించింది. వెంటనే కండక్టర్ చెప్పింది. దీంతో బస్సును ఆపి, ఎవరైనా ఆభరణాలు తీసుంటే ఇవ్వాలని కోరారు. ఎలాంటి స్పందన లేకపోవడంతో డ్రైవర్.. బస్సును ధారూరు పీఎస్‌కు తరలించారు. అనంతరం ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రయాణికులను సోదా చేశారు. ఎవరి వద్దా నగలు లభించలేదు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

దోమ: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళా పురుగుల మందు సేవించి, చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటన దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఆనంద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బొంపలికి చెందిన మల్లయ్య భార్య కమలమ్మ(47) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్యం చేయించినా పరిస్థితిలో మార్పురాలేదు. దీంతో మానస్తాపం చెందిన ఆమె.. గురువారం సాయంత్రం పొలానికి వెళ్లి, పురుగు మందు తాగింది. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా.. వారు కమలమ్మను పరిగి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వికారాబాద్‌కు అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది.

తుది దశకు 'అమ్మ ఆదర్శం'

జిల్లాలో మొత్తం 1,062 పాఠశాలలు

- అమ్మ ఆదర్శ పాఠశాలలకు ఎంపికైనవి 924
- పనులు పూర్తయిన స్కూళ్లు 792
- చెల్లించిన బిల్లులు రూ.17.23 కోట్లు
- పురోగతిలో ఉన్న బడులు 32



నవాబుపేట మండలం చించల్‌పేటలోని అమ్మ ఆదర్శ పాఠశాల

వికారాబాద్: జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులు తుది దశకు చేరుకున్నాయి. గత ప్రభుత్వం మన ఊరు – మనబడి పేరుతో పాఠశాలలను బలోపేతం చేసే కార్యక్రమం చేపట్టగా.. దీన్ని అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోంది. స్కూళ్లలో మౌలిక వసతుల కల్పన, మరమ్మతు పనులు చేసేందుకు శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వం మూడు విడతల్లో పనులు పూర్తి చేసేందుకు సంకల్పించగా ప్రస్తుత సర్కారు ఒకే విడతలో అన్ని పాఠశాలల్లో పనులు ప్రారంభించి పూర్తి చేయాలని నిర్ణయించింది. అయితే ఈ విషయాన్ని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సీరియస్‌గా తీసుకున్నారు. పనుల పర్యవేక్షణ బాధ్యతలు విద్యాశాఖకు అప్పగించారు. టెక్నికల్ సపోర్టు, బిల్లులు చేసే బాధ్యతలు ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ చూస్తోంది. మెజార్టీ పాఠశాలల్లో పనులు పూర్తి కాగా కొన్ని చోట్ల కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు మాత్రం విడుదల కాలేదు.

రూ.35.5 కోట్లతో పనులు

జిల్లాలో మొత్తం 1,062 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. గత ప్రభుత్వం మన ఊరు – మనబడి కార్యక్రమంలో భాగంగా మొదటి విడతలో 371 పాఠశాలలు ఎంపిక చేసింది. ఇందులో గత అసెంబ్లీ ఎన్నికల నాటికి 46 పాఠశాలల్లో పనులు పూర్తి చేశారు. మరో 92 చోట్ల పనులు పురోగతిలో ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతంలో పూర్తయిన పాఠశాలలు పోనూ ఒకే విడతలో 924 ప్రభుత్వ పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపిక చేశారు. భవన మరమ్మతులు, విద్యుత్ సదుపాయం, ఇతర పనుల కోసం రూ.35.5 కోట్లు అవసరం అవుతాయని ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం ఆ మేరకు నిధులు మంజూరు చేసింది. పనులు ప్రారంభించే సమయంలోనే అడ్వాన్స్‌గా అంచనా వ్యయంలో 25 శాతం నిధులు రూ.8.88 కోట్లు పాఠశాలలకు అందజేసింది. ఇప్పటి వరకు 792 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. ఇందుకు సంబంధించి రూ.17.23 కోట్లు చెల్లించారు.

పనుల్లో పారదర్శకత పాటించేలా..

అమ్మ ఆదర్శ పాఠశాలల పురోగతిపై కలెక్టర్ ప్రతి వారం సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు పనులు పూర్తయిన 792 పాఠశాలలకు బిల్లులు మంజూరు చేశారు. జి ల్లా వ్యాప్తంగా మరో 132 పాఠశాలల్లో పనులు జ రుగుతున్నాయి. పనుల నాణ్యత విషయంలో క్షేత్రస్థాయి పరిశీలనతో పాటు అధికారులతో నిరంతర సమీక్షలు నిర్వహిస్తున్నారు. పాఠశాలల్లో ప్రధానంగా తాగునీటి సౌకర్యం, మూత్రశాలలకు మరమ్మతులు, విద్యుదీకరణ పనులు వంటివి చేపడుతున్నారు.

రైతు సమస్యలు పరిష్కరించండి

- ప్రజా సంఘాల అభ్యర్థన
- కడా ప్రత్యేక అధికారికి వినతిపత్రం

కొడంగల్ రూరల్: రైతు సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బొంరాస్‌పేట ఎస్‌బీఐ ఎదుట రైతులు మూడు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారని తెలిపారు. అయినా సంబంధిత అధికారుల్లో చలనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి షరతులు లేకుండా పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకులో తగినంత సిబ్బంది లేకపోవడంతో పనులు కదలడం లేదని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుభాష్, అంబేడ్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రమేష్‌బాబు, కేఎన్‌పీఎస్ నాయకులు లక్ష్మయ్య, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



కడా ప్రత్యేకాధికారికి వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

వైద్యం అందక పాడి గేదె మృతి

- వికారాబాద్ వెటర్నరీ ఆస్పత్రిలో ఘటన
- బోరున విలపించిన బాధితుడు

అనంతగిరి: పశువైద్యాధికారుల నిర్లక్ష్యంతో తన పాడి గేదె మృతి చెందిందని బాధితుడు ఆవేదన వ్యక్తంచేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. వికారాబాద్‌లోని ఆలంపల్లికి చెందిన తలారి రవి రూ.లక్ష న్నర పెట్టి 15 రోజుల క్రితం ఓ పాడి గేదెను కొనుగోలు చేశాడు. చూడితో ఉన్న గేదె గడ్డి మేయకపోవడంతో పట్టణంలోని పశువైద్యశాలకు తీసుకువచ్చాడు. డాక్టర్ అందుబాటులో లేకపోవడం, ఫోన్ చేసినా 'వేరే కార్యక్రమంలో ఉన్నా' అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఆస్పత్రి వద్దే ఉండిపోయాడు. అనంతరం ఎన్నిసార్లు ఫోన్ చేసినా వైద్యుడు స్పందించలేదు. మధ్యాహ్నం 2గంటలకు విషయం మీడియాకు తెలియడంతో మరో ఆస్పత్రికి చెందిన వైద్యుడిని పంపించారు. కానీ 4గంటల ప్రాంతంలో గేదె మృతి చెందింది. దీంతో రైతు కన్నీరు మున్నీరయ్యాడు. సకాలంలో వైద్యం అందితే తన గేదె చనిపోయి ఉండేది కాదని, బర్రె మృతితో ఉపాధి కోల్పోయానని విలపించాడు.



మృతి చెందిన బర్రెతో బాధిత రైతు

చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి మృతి

- మైల్వార్‌లో విషాదఛాయలు
- కేసు నమోదు చేసిన పోలీసులు



అంజిలప్ప (ఫైల్)

దుద్యాల్: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి మృతిచెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని పులిచెర్లకుంట తండాలో శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బొంరాస్‌పేట ఎస్‌ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుద్యాల్ మండల పరిధిలోని చిలుముల మైల్వార్‌కు చెందిన బుక్కి అంజిలప్ప(45) ఈనెల 18న చేపల వేటకు వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. ఉదయాన్నే వెళ్లిన వ్యక్తి చీకటిపడినా తిరిగి రాకపోవడంతో భార్య నర్సమ్మ వెతకడం ప్రారంభించింది. ఫలితం లేకపోవడంతో మరుసటి రోజు 19న పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. గ్రామానికి చేరుకున్న పోలీసులు వివరాలు ఆరా తీయగా చేపలు పట్టేందుకు వెళ్లాడని తెలుసుకుని, సమీపంలోని చెర్లకుంటలో వెతకగా.. కుంటలోని బోరు మోటారు వద్ద మృతదేహం కనిపించింది. బాడీని కొడంగల్ ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్యత నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. అంజిలప్ప మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి రిమాండ్

కడ్తాల్: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండాలో చోటుచేసుకుంది. శుక్రవారం సీఐ శివప్రసాద్ ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ నెల 19న గణేశ్ నిమజ్జన బందోబస్తుకు వెళ్లిన కానిస్టేబుల్ మహేశ్, హోంగార్డు లక్ష్మణ్‌పై తండాకు చెందిన నేనావత్ సేవ్యానాయక్ దురుసుగా ప్రవర్తించాడు. అసభ్యపదజాలంతో దూషి స్తూ.. వారిని నెట్టేశాడు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు సేవ్యానాయక్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

భూమి కాజేశారని ఫిర్యాదు

కొందుర్గు: తప్పుడు పత్రాలు సృష్టించి తమకు రావలసిన భూమిని కాజేశారని జడ్చర్లకు చెందిన మహ్మద్ ఖలీచ మతీన్, మోసీన్ సమద్ తదితరులు శుక్రవారం కొందుర్గు పోలీసులను ఆశ్రయించారు. తమ ముత్తాత అబ్దుల్ ఖయ్యూమ్ పేరిట తంగెళ్లపల్లి 370 సర్వేనెంబర్‌లో గుంట 27గజాల భూమి ఉందన్నారు. మేము తాతల కాలం నుంచే ఊరురాతిరిగి జాతర్లో బుక్కా అమ్ముకుంటు జీవనం సాగించేవారమన్నారు. ఈ క్రమంలో తాము జడ్చర్ల పట్టణంలో స్థిరపడ్డామని ఫిర్యాదులో పేర్కొన్నారు. తంగెళ్లపల్లిలో తమ భూమిని వీరన్నపేట గ్రామానికి చెందిన జహంగీర్ తప్పుడు అఫిడవిట్, మరణధ్రువపత్రం సృష్టించి తమకు రావలసిన భూమిని కాజేశాడని పేర్కొన్నారు. 80 ఏళ్ల క్రితం మరణించిన తమ ముత్తాత 2014లో మరణించినట్లు డెత్‌సర్టిఫికెట్ సృష్టించారని వాపోయారు. సదరు భూమిని గుర్రంపల్లికి చెందిన పెంటయ్యకు విక్రయించారని ఈ విషయంలో సరైన విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

రూ.5 లక్షల వ్యయంతో వాటర్ ప్లాంట్

అభినందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని బండోనిగూడలో కాంగ్రెస్ నాయకుడు పసుల బుచ్చయ్య సొంత డబ్బులు వెచ్చించి రూ.5లక్షల వ్యయంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తుల ఆరోగ్య పరిరక్షణకు బుచ్చయ్య సొంత డబ్బుతో ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గ్రామంలో మహిళా భవన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగ నర్సింహయాదవ్, నాయకులు కృష్ణ, నర్సింహ, శ్రీశైలం, రాజు, యాదయ్య, శ్రీశైలం, తిరుపతి, పాండు, ఆంజనేయులు, మల్లేశ్, కుమార్, అశోక్, బాలకృష్ణ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

తిరుగులేని శక్తిగా భారతి సిమెంట్

- టెక్నికల్ మేనేజర్ సునీల్
- తాపీ మేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్ల అందజేత

అనంతగిరి: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదల చేసిందని, ఆ సంస్థ టెక్నికల్ మేనేజర్ సునీల్ తెలియజేశారు. వికారాబాద్‌లోని శ్రీ గణేశ్ ట్రేడర్స్ డీలర్ షాప్‌లో శుక్రవారం తాపీ మేస్త్రీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగంగా పూర్తవుతుందని తెలిపారు. అల్ట్రాఫాస్ట్‌తో ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక అని పేర్కొన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని వివరించారు. స్లాబ్ వేసే సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని స్పష్టంచేశారు. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ 20 రూపాయలు మాత్రమే అధికంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా 50 మంది తాపీ మేస్త్రీలకు లక్ష రూపాయల ప్రమాద బీమా బాండ్లు అందజేశారు. డీలర్ రమేశ్, మల్లేశ్ మాట్లాడుతూ.. భారతి సిమెంట్ సర్వీస్ చాలా ఫాస్ట్‌గా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ జిల్లా మార్కెటింగ్ మేనేజర్ వీరాంజనేయ రెడ్డి, టెక్నికల్ ఇంజనీర్ సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.



తాపీ మేస్త్రీలకు బాండ్లు అందజేస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధులు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

వనస్థలిపురం ట్రాఫిక్ పీఎస్ ఎస్‌హెచ్‌ఓ ఘట్టుమల్లు

అబ్దుల్లాపూర్‌మెట్: సీటింగ్ సామర్థ్యానికి మించి.. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల విద్యార్థులను తీసుకెళ్లే వాహనాలపై చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ బి.ఘట్టుమల్లు, ఇన్‌స్పెక్టర్ ఆర్.శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. పెద్దఅంబర్‌పేట శివారులోని రమాదేవి పబ్లిక్ స్కూల్‌కు వెళ్లే దారిలో విజయవాడ జాతీయ రహదారిపై శుక్రవారం పాఠశాల వాహనాలు, ప్రైవేటు వాహనాల తనిఖీకి స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన తనిఖీల్లో మూడు వాహనాలకు జరిమానా విధించారు. నిబంధనలు పాటించని వాహనాలపై చర్యలు తీసుకునేందుకు ప్రతీరోజు ఉదయం సాయంత్రం వాహనాల తనిఖీ చేపడతామన్నారు.

ఉద్యమానికి ఊపిరైన సాయిచంద్

కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: మలిదశ తెలంగాణ ఉద్యమానికి సాయిచంద్ ఊపిరి అని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. శుక్రవారం సాయిచంద్ జయంతి వేడుకలను యువనాయకుడు కేశని మహేశ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తో పాటు సాయిచంద్ సతీమణి రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజనీసాయిచంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మలిదశ ఉద్యమ సమయంలో ఆయన ఆటపాటలతో ఉద్యమ స్ఫూర్తిని నింపిన మహనీయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో హరీశ్ అన్న యువసేన జిల్లా నాయకులు హెచ్‌ఆర్ మహేశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు జోగు వీరయ్య, రామకృష్ణ, లాయక్‌అలీ, మహేశ్, అంజి, డాన్ శ్రీను, సాయిలు, రాజేందర్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



సాయిచంద్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జైపాల్‌యాదవ్, రజనీ సాయిచంద్ తదితరులు

భార్యను హత్య చేసిన భర్తకు జీవితఖైదు

- రూ.25వేల జరిమానా
- వివరాలు వెల్లడించిన పట్టణ సీఐ విజయకుమార్



సీఐ విజయకుమార్

షాద్‌నగర్‌రూరల్: భార్యను హత్య చేసిన కేసులో భర్తకు జీవిత ఖైదు విధిస్తూ జిల్లా అడిషనల్ సెషన్స్ కోర్టు తీర్పునిచ్చింది. పట్టణ సీఐ విజయకుమార్ కేసు వివరాలను వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం మేడిగడ్డతండాకు చెందిన జటావత్ లలిత(30)కు ఫరూఖ్‌నగర్ మండలం అన్నారం గ్రామపంచాయతీ పరిధిలోని గుండ్యాతండాకు చెందిన జటావత్ రమేశ్‌తో పన్నెండేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఒక కుమారుడు. రమేశ్ వ్యసనాలకు బానిసవ్వడంతో కాపురంలో కలహాలు మొదలయ్యాయి. దీంతో భార్య లలితను నిత్యం వేధింపులకు గురిచేసేవాడు. పెద్దలు ఎన్నిసార్లు కౌన్సెలింగ్ ఇచ్చినా తీరు మార్చుకోలేదు. ఈ క్రమంలో 2020 అక్టోబర్ 20న ఎప్పటిలాగే ఇంటికి వచ్చిన రమేశ్ భార్యను అంతమొందించాలని నిర్ణయించుకుని గొంతు, ఇతర శరీర భాగాలపై కత్తితో పొడిచి పారిపోయాడు. విషయం తెలుసుకున్న లలిత తల్లి, సోదరులు అక్కడకు చేరుకుని తీవ్ర రక్తస్రావంతో కొట్టుమిట్టాడుతున్న ఆమెను ప్రథమ చికిత్స అనంతరం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో 2020 నవంబర్ 2న చికిత్స నిమిత్తం పట్టణంలోని శివరాంనాయక్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. చికిత్స పొందుతున్న లలిత 2020 నవంబర్ 5న మృతి చెందింది. భర్త కత్తితో దాడి చేయడంతోనే లలిత మృతి చెందిదని రమేశ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతురాలి తల్లి పాత్లావత్ పీరీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పరారీలో ఉన్న రమేశ్‌ను పట్టుకున్న పోలీసులు జైలుకు పంపించారు. అనంతరం నిందితుడు బెయిలుపై బయటకు వచ్చాడు. అప్పటి ఎస్‌హెచ్‌ఓ శ్రీధర్‌కుమార్ పూర్తి ఆధారలను సేకరించి కోర్టులో చార్జిషీట్ వేశారు. కేసును నిశితంగా పరిశీలించిన ఎల్బీనగర్‌లోని జిల్లా అడిషనల్ సెషన్స్ కోర్టు నిందితుడికి జీవిత ఖైదు, రూ.25వేల జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించింది. దీంతో రమేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కాంగ్రెస్ ఎంతకైనా దిగజారుతుంది

- జాతీయవాదమే బీజేపీ సిద్ధాంతం
- భారత్‌కు స్వదేశంలోనే శత్రువులు ఎక్కువయ్యారు
- చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి



ధారూరు: కేరెళ్లి సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

ధారూరు: రాజకీయ అవసరాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎంతకై నా దిగజారుతుందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. వికారాబాద్ జిల్లా ధారూరు మండలంలోని కేరెళ్లిలో చేపట్టిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. భారతీయులకు స్వదేశంలోనే శత్రువులు ఎక్కువయ్యారని, ఇందులో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ కూడా ఒకరని తెలిపారు. కులాలు, మతాల పేరుతో ప్రజలను విడదీసేందుకు ఆయన కుట్ర చేస్తున్నారన్నారు. నిస్వార్థంగా సేవ చేశారనే నమ్మకంతోనే ప్రజలు మూడోసారి మోదీని ప్రధానిగా బలపర్చారని స్పష్టంచేశారు. బీజేపీ సిద్ధాంతం జాతీయవాదమేనని, దేశహితం కోసమే మోదీ పనిచేస్తున్నారని తెలిపారు. దేశంపై మమకారం ఉన్నవారంతా బీజేపీ వైపునకు రావాలని పిలుపునిచ్చారు. మోదీ కారణంగానే భారత్ అనేక రంగాల్లో టాప్ 5 స్థానంలో ఉందన్నారు. పేదలకు చెందాల్సిన వక్ఫ్ బోర్డు భూములన్నీ ప్రస్తుతం బడా బాబుల ఆధీనంలో ఉన్నాయన్నారు. ఇది దేశానికి ఏమాత్రం మంచిది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. భారత్ అభివృద్ధి, మోదీ సారథ్యాన్ని తట్టుకోలేకపోతున్న చైనా, అమెరికా, పాకిస్తాన్ వంటి దేశాలు కయ్యానికి కాలు దువ్వుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, మండల అధ్యక్షుడు ఎం.రమేశ్, వికారాబాద్ కోఆర్డినేటర్ వడ్ల నందు, నాయకులు పాండుగౌడ్, రాజునాయక్, వివేకానందరెడ్డి, నరోత్తమ్‌రెడ్డి, రాజేందర్‌గౌడ్, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఒకే దేశం ఒకే ఎన్నిక మంచి పరిణామం

అనంతగిరి: ఒకే దేశం ఒకే ఎన్నిక మంచి పరిణామమని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్‌లోని మా శారద ఆస్పత్రిలో ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ శ్రేణులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎంపీ ముఖ్యఅతిథిగా పాల్గొని రక్తదానం చేసిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలను అభినందించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చని అన్నారు. అనంతరం రక్తం ఇచ్చిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం బీజేపీ నాయకుడు రాజేందర్‌రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జమిలి ఎన్నికలు అంటేనే పలు పార్టీల్లో వణుకు పుడుతోందన్నారు. ప్రధాని మోదీ అఖండ భారతదేశాన్ని అభివృద్ధి చేసేలా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలన్నారు. ప్రతి నాయకుడు చురుగ్గా పాల్గొనాలని సూచించారు. అనంతగిరి గుట్టను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు రూ.100 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. వికారాబాద్ వరకు ఎంఎంటీఎస్ తోపాటు పలు ప్రాంతాల్లో బ్రిడ్జిల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నాలుగు లేన్ల రోడ్డును రాబోయే రెండు మూడేళ్లలో అందుబాటులోకి వచ్చేలా కృషి చేస్తామన్నారు. కేంద్రం నుంచి రోడ్ల నిర్మాణానికి నిధులు తీసుకువస్తామని, ఇందుకు రాష్ట్ర వాటా ఇవ్వాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో రోడ్ల నిర్మాణం కోసం ఈ నెల 24న కేంద్ర మంత్రి నితిన్‌గడ్కారీని స్పీకర్‌తోపాటు కలవనున్నట్లు తెలిపారు. హార్టికల్చర్ అభివృద్ధికి కేంద్రం రూ.14 వేల కోట్లు ఖర్చు చేయనుందని, అందులో రూ.వెయ్యి కోట్లు ఈ ప్రాంతానికి వచ్చేలా కృషి చేస్తామన్నారు. తాండూరులో నాపరాతి గనులకు 300 ఎకరాలు కేటాయించి రవాణా సదుపాయం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరి: రక్తదాన శిబిరంలో ఎంపీ